# ఉభయ తారకం

—వి. జె. ప్రసాద్

''నాయనా! భాస్కరం ఇదేనా రావడం. అమ్మానాన్న కులాసాగా వున్నారా? సావిత్రీ! భాస్కరానికి చెంబుతో నీళ్లు అందించవే'' అని మామయ్య, అత్తయ్య భాస్కరాన్ని ఆహ్వానించారు.

పండుగ సెలవులు కదా అని భాస్కరం మేనమామగారి ఊరు బయలుదేరాడు. పల్లెటూరి అందాలు చూడొచ్చు, తన మరదలి పిల్ల అందాన్ని ఆస్వాదించవచ్చు. ఉభయ తారకంగా వుంటుంది కదా అని.

అమ్మ బయల్దేరినప్పుడే చెప్పింది.

''ఒరేయ్! నేను చెప్తున్నది జాగ్రత్తగా విను. నువ్వు మా అన్నయ్య వాళ్ల ఊరు ఎలాగో ఇన్నాళ్ల తరువాత వెడుతున్నావ్? అక్కడ సావిత్రిని చూడు. నీకు నచ్చితే మా అన్నయ్య వస్తాడు. మీ నాన్నతో మాట్లాడతాడు. ఇదేం మెడ తిరగని మేనరికం కాదు సుమా! మీ ఇద్దరికీ ఇష్టపడుతూ వుంటేనే మీ పెళ్లి జరుగుతుంది సుమా'' అని తల్లి హెచ్చరించింది.

అల్లుడికి ఇష్టమైన గుత్తి వంకాయకూర, దోసకాయ పెరుగుపచ్చడి, కొత్తిమీర కారం తయారుచేసి వడ్డించి అల్లుడ్ని ఆప్యాయంగా చూడసాగింది భాస్కరం మేనత్త అనసూయ.

తనకిష్టమైన వంటకాలు రుచిగా వండి వడ్డించడంతో భోజనం మీద మనసు లగ్నం చేసాడు భాస్కరం.

''బావా! ఇదిగో నీళ్లు అందుకో'' భాస్కరం చేతిలో చెంబు వుంచి తన బొటనవేలుతో భాస్కరం చేతిలో గీసినట్టు రాస్తూ ఒక్కసారి భాస్కరం కళ్లల్లోకి కళ్లు కలిపి మెరుపులాంటి చూపు విసిరి పారిపోయింది సావిత్రి.

ఆ స్పర్శకి, ఆ చూపుకి ఆ క్షణంలో వెయ్యి వోల్టుల విద్యుత్ నరాల్లో ప్రవహించినట్లయ్యింది భాస్కరానికి. అనుకోకుండానే పారిపోతున్న సావిత్రివైపు చూసాడు భాస్కరం.

పొడవాటి జడ అటూ ఇటూ ఊగుతూ, ఇటూ అటూ వున్న పాలవంకల్ని వెలుగుతూ ఆరుతూ వుండే శ్రేణీ దీపాల్లా కనిపింపజేసి కనువిందు కలుగచేస్తోంది. జడకుచ్చులు ఆమె పిరుదులమీద ముద్దు పెట్టుకుంటూ తమ అదృష్టాన్ని చాటుకుంటున్నాయి. భాస్కరం తన్మయుడయిపోయి అలాగే వుండిపోయాడు. ఆ జడలో నుండి రాలిన మల్లెలు బాటగా ఏర్పడి తనని రమ్మని కవ్విస్తున్నట్లనిపించింది.

''ఏంటయ్యా అల్లుడూ! అటు నుండి అటే పోతావా?'' ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ అడిగిన మామయ్య, అత్తయ్య మాటలు చెవిలో పడడంతో ఈ లోకంలోకి వచ్చాడు భాస్కరం. కాళ్లు కడుక్కుని ఇంట్లోకి నడిచాడు. మనసును సావిత్రికి తోడుగా వుంచాడు.

వంటింటి చివరనున్న ద్వారంవద్ద నుండి గాజుల చప్పుడు వినిపించడంతో ఉలిక్కిపడి అటు చూసాడు. అచేతనుడయ్యాడు భాస్కరం. అక్కడ సావిత్రి ద్వారానికి ఆనుకుని నిలబడింది. వదులుగా అల్లిన బరువైన జడను ముందుకు వేసుకుంది. ఆ జడ ఆమె పొడవాటి మెడని చుట్టి భుజం మీదుగా పయ్యెదమీదకు జారి పాలవంకకూ, నాభికీ మధ్యనున్న భాగాన్ని తాకుతూ ఇంక కిందకి దిగే సాహసం చేయలేక అక్కడే ఆగిపోయింది. ఆమె జడలో పెట్టుకున్న పువ్వులు, ఆమె బుగ్గల్ని చూస్తూ సిగ్గుతో ఎరుపెక్కి గులాబీలుగా మారిపోయాయి. ఒక పాదం నేలమీద మోపబడింది. కుడిపాదం ద్వారబంధం గుమ్మంమీద నుంచి బొటనవేలుతో ఆ గుమ్మం మీద గీస్తోంది. ఆమె పాదాలు తనని తాకడంవలన ఆ గుమ్మం బంగారురంగులోకి మారిపోయి కొత్త కాంతులు సంతరించుకుంది. ఆమె చూపులు నేలని తాకుతూ పాకుతూ భూమిద్వారా భాస్కరం గుండెల్ని తాకుతున్నాయి. భాస్కరంలోని రస హృదయం పరవళ్లు తొక్కుతోంది.

''సావిత్రీ! బావకి పెరుగు వడ్డించు'' అన్న మాటతో సావిత్రి మువ్వలు పట్టీలు సవ్వడి చేస్తుండగా పరుగు పరుగున రావడం, నేలకంటుతున్న లంగాని బొడ్లో దోపుకోవడం, ఆ సమయంలో అంతవరకూ దాగి బహిర్గతమయిన ఆమె శరీరం సోయగాలు భాస్కరాన్ని కలవరపరిచాయి.

పెరుగు వడ్డిస్తున్నప్పుడు స్థానభ్రంశం చెందిన పయ్యెద ఎదలోని వంపుసొంపుల్ని బహిర్గతం చేస్తుంటే భాస్కరానికి మతిపోయినంత పనయిపోయింది.

భోజనం అయిందని అనుకున్నాడు. అల్లుడి అవస్థను చూసిన మేనత్త ముసిముసిగా నవ్వుకుంటుంటే ఆ నవ్వుని చూస్తూ మధుర జ్ఞాపకాల్ని నెమరు వేసుకోసాగాడు భాస్కరం మేనమామ.

మరునాటి ఉదయం దుప్పటి ముసుగు తొలగించి కిటికీలో నుండి బయటకు చూసిన భాస్కరానికి సూర్యోదయం బదులుగా చంద్రోదయం కనిపించింది.

అక్కడ వంగి ముగ్గులు పెడుతూ తన మేని అందాలు దాచుకోలేక అవస్థపడుతూ బావ లేచిపోయి దొంగచూపులు చూస్తూ వుంటాడేమోననే అనుమానంతో సావిత్రి ఆ కిటికీవైపు చూస్తూ పట్టుబడిపోవడం అందుకు కారణం అయివుండవచ్చు.

నూతి దగ్గర స్నానం చేస్తున్న భాస్కరానికి తన వీపు మీద సున్నితంగా చేతివేళ్లు తగులుతుంటే విద్యుద్ఘాతం తగిలినట్లు అనిపించి వెనక్కి తిరిగాడు. ఆ వెనక్కి తిరగడం ఊహించని సావిత్రి వెల్లకిలా పడిపోబోయింది. అసంకల్పితంగా ఆమెను పడిపోకుండా పొదివి పట్టుకున్నాడు. సావిత్రి అతనికి అతుక్కుపోయింది భయంతో. అలా ఎంతసేపు వుండిపోయారో ఆ మన్మథుడికి కూడా తెలియదేమో!

బిగి కౌగిలి విడిపించుకుని దూరంగా జరిగింది.

''నీ వీపు నీకు అందదుగా'' అమాయకంగా అంటూ ఛెంగున లేడిపిల్లలా పరుగెడుతూ మాయమయిపోయింది సావిత్రి.

ఆ విధంగా వారిద్దరికీ గాంధర్వ వివాహం జరిగిపోయింది పంచభూతాల సాక్షిగా.

ఆ తర్వాత వివాహం జరిగింది పెద్దల సాక్షిగా. నూతన దంపతులు కొత్త కాపురం ప్రారంభించారు.

మొదటి సంవత్సరం భాస్కరం మాటలు సావిత్రి విని అర్థం చేసుకుంది. ఆ విధంగానే భాస్కరంలోని రసహృదయాన్ని స్పందింపచేస్తూ అతని అర్థాంగి అనిపించుకుంది.

రెండవ సంవత్సరం చనువు ఏర్పడడంతో తన మనసులోని మాటలు, అభిప్రాయాలు భాస్కరానికి చెప్పింది. అవి నచ్చినా నచ్చకపోయినా మనసుకు నచ్చచెప్పుకుని ఆమె చెప్పినట్లు నడుచుకున్నాడు. ఆమెకి భర్తననిపించుకున్నాడు.

మూడవ సంవత్సరం ఇద్దరు ముగ్గురయ్యారు. అక్కడితో ఇద్దరిలో సర్దుబాటు ధోరణి మాయం అయింది. భాస్కరం సహజ ధోరణిలో వున్నా సావిత్రి ధోరణి మారిపోయింది. ఎంతసేపూ పిల్లాడే లోకంగా మారిపోయింది. అబ్బాయిని అభిమానంగా చూడసాగాడు. భార్య అభిమానాన్ని చూరగొనడానికి రసాస్వా

దన కనుమరుగయిపోతే ఎలా? అనే బాధతో సావిత్రి భాస్కరం బాధని అర్థం చేసుకునే స్థితిలో లేదు.

'భార్య కోసం మగవాడు సంతానాన్ని అభిమానిస్తాడు. పిల్లలకోసం స్త్రీ భర్తని ప్రేమిస్తుంది' అన్నది ఆర్యోక్తి.

కానీ వీరి విషయంలో సావిత్రి అలా వుండకపోయేసరికి సావిత్రిమీద భాస్కరానికున్న ప్రేమ ద్వేషంగా మారబోయే సూచనలు కనిపిస్తున్నాయి.

ఫలితం మూడో సంవత్సరం వీళ్లిద్దరి మాటలూ ఇరుగుపొరుగు వాళ్లు వినసాగారు.

పరువు పోతుందని చెప్పి భాస్కరం సర్దుబాటు ధోరణి అలవాటు చేసుకున్నాడు భార్యకి ఎలా చెప్పాలో అర్థంకాక.

★★★

చెక్కా గుండీలు పెట్టకోవడం పూర్తయింది. తమ మధురమైన జీవితాన్ని చిరుగుల చొక్కా కప్పేసింది అని అనుకుంటూ బయటకు నడిచాడు భాస్కరం.

సాయంత్రం చంద్రం భాస్కరాన్ని తోడు తీసుకుని షికారుకి బయలుదేరారు. ఇద్దరు మిత్రులు పార్కులో కూర్చున్నారు. భాస్కరం ఎదురుగా చూసాడు.

పిల్లలు ఆడుకుంటున్నారు. వాళ్ల తల్లిదండ్రులు దూరంగా చెట్టుకింద కూర్చుని ఒక కంటితో పిల్లల్ని కనిపెడుతూ ఒకరినొకరు హత్తుకుంటూ తమ లోకంలో ఉండిపోసాగారు.

''మనసుంటే మార్గం వుంటుంది చంద్రం. అయినా అనుభవించడానికి కూడా యోగముండాలి'' అని నిస్పృహగా అన్నాడు.

''ఒరేయ్ భాస్కరం! ఏమీ అనుకోకు. ఈమధ్య నీలో ఉత్సాహం, చలాకీతనం తగ్గిపోయాయి. ఎంతో సరదాగా మాట్లాడేవాడివి. నోరు విప్పితే చాలు ప్రకృతి, అందం, ఆనందం అంటూ మమ్మల్ని ఏ లోకానికో తీసుకుపోయేవాడివి. ఆ రసికత్వం ఏమయిందిరా?'' బాధగా అడిగాడు చంద్రం.

''మూడునాళ్ల ముచ్చటగా మిగిలిపోయిందిరా. వలచి పరించిన కాంత వింతగా మారిపోయిందిరా. మధురానుభవాలు, మధురానుభూతుల్ని మిగిల్చి దూరంగా పారిపోయాయి. రసాస్వాదనకు అలవాటు పడకనే పోవాలి. అలవాటుపడి అందుబాటులో వుండి కూడా అనుభవానికి రాకుండా వుంటే ఇదిగో నా బతుకులా అయిపోతుంది. అందుకే పోతన అన్నాడు.

మందార మకరంద మాధు
ర్యమునదేలు
మధుపంబు
వోవునే సదనము
లకు.... అని.

నిరాశా నిస్పృహలే కానీ నా జీవితంలో ఏమి మిగిలేయి''! అని తన బాధ చంద్రానికి వెళ్ళబోసుకున్నాడు భాస్కరం.



దూరంగా వున్న దంపతులు విడివడి పిల్లల్ని నడిపించుకుంటూ పార్కులో నుండి బయటకు నడవసాగేరు.

''నీదో రకమైన బాధ. నాదో రకమైన బాధ. అందమైన భార్య వుంది. అనుభవించే వయసుంది. మా ఇద్దరికీ కోరికలున్నాయి. మధుర రసానుభూతిని పొందాలనే ఆశ మిగిలిపోయింది. దానికి నీ సహాయం అర్థిస్తున్నాను'' అని ప్రాధేయపడ్డాడు చంద్రం.

''బాగుంది వరుస? రోలొచ్చి మద్దెలతో తన బాధ చెప్పుకున్నట్లుంది. నేనే నిస్సహాయుణ్ని. నేను ఈ విషయంలో నీకేం సహాయం చేయగలను?'' భాస్కరం అడిగాడు.

''సమయం వచ్చినప్పుడు చెబుతాను. అంతవరకూ ఓపికపట్టు. మా ఆవిడా నేనూ అనుకోవాలిగా'' అని చెప్పాడు చంద్రం.

భాస్కరం, చంద్రం లేచి భారంగా అడుగులు వేయసాగారు.

★★★

ఆ రోజు అటో ఇటో తేల్చుకోవాలనుకున్నాడు భాస్కరం. రాత్రి పక్కమీద పల్లెపూలు చల్లాడు. అగరొత్తులు వెలిగించాడు. భార్యకోసం ఎదురు చూస్తున్నాడు.

పాలగ్లాసు పట్టుకుని పడకగదిలోకి అడుగుపెట్టింది సావిత్రి.

ద్విగుణీకృతమైన ఆమె అందచందాల్ని తదేకంగా చూస్తూ మధురమైన ఊహాలతో తేలిపోతూ ఆమె దగ్గ

రకు వచ్చి చేయి పట్టుకుని మీదకు లాక్కున్నాడు భాస్కరం.

ఆమె వీపు నిమురుతూ ఆమెని దగ్గరగా హత్తుకుంటూ ఆమె బుగ్గలమీద చుంబించబోయాడు.

''మీకు తొందరతప్ప సమయం, సందర్భం తెలీవు. బంగారంలాంటి పాలు నేలపాలు చేసారు. వదలండి. అవతల పిల్లాడు ఏడుస్తున్నాడు'' అని భర్త కౌగిలి విడిపించుకుని దూరంగా జరిగిపోయి కిందపడిపోయిన పాలగ్లాసుని తీసి పాలను మూలనున్న బట్టతో తుడవసాగింది.

భాస్కరం కోరిక ఆవిరైపోయింది. ఆవేశం పెరిగింది.

''సావిత్రీ! చాలా రోజులనుంచి చూస్తున్నాను. భరిస్తున్నాను. ఇంక నేను భరించలేను. నువ్వూ నీ కొడుకూ మీ పుట్టింటికి దయచేయండి. వాడు పెరిగి పెద్దవాడయి ఓ ఇంటివాడు అయిన తరువాత వద్దువుగాని'' ఆవేశంగా అన్నాడు.

''అనండి. బాగా అనండి. అక్కడకు నేనేదో తప్పు చేస్తున్నట్లు. చంటి పిల్లాడిని జాగ్రత్తగా చూసుకోవడమే నేను చేసిన నేరం. మా అమ్మ దగ్గరకే పోతాను. మీరు హాయిగా, ఆనందంగా వుండండి'' అంటూ రాగాలు పెడుతూ ఆ గదిలో నుండి బయటకు వెళ్లిపోయింది సావిత్రి. ఇదీ పతివ్రతా ధర్మం విరక్తిగా అనుకుంటూ రాని నిద్ర కోసం ప్రయత్నించసాగాడు భాస్కరం.

సూర్యోదయంతో సావిత్రి పుట్టింటికి బయలుదేరిపోయింది. భాస్కరం ఏమీ మాట్లాడలేదు.

★★★

''ఏమే సావిత్రి! అందరూ క్షేమమేనా? అల్లుడు రాలేదా'' సావిత్రి చేతిలో పిల్లాడ్ని ఎత్తుకుంటూ అడిగింది అన్నపూర్ణ.

''ఆయనకు తీరుబాటు లేదుట. అందుకే నన్ను చూసుకోవడానికి అవకాశంలేదు. నువ్వూ పిల్లాడు ఇబ్బంది పడిపోతారు. నువ్వు మీ అమ్మ దగ్గర వుండిరా అని పంపించేసారు'' ఉక్రోషంగా అంది సావిత్రి.

అల్లుడితో అమ్మాయి తగువు పడిందని అర్థమయిపోయింది. ముందు ఇంట్లోకి తీసుకెళ్లి భోజనం పెట్టి విశ్రాంతి తీసుకొమ్మని చెప్పింది.

ఆ రాత్రి తల్లీకూతుళ్లు మాట్లాడుకున్నారు. అన్నపూర్ణ సావిత్రిని తిట్టిపోసింది ఆమె అవివేకానికి. ఇది ఆడవాళ్ల విషయం అని తండ్రి కలుగచేసుకోలేదు.

రాత్రి పదకొండు గంటలు దాటింది.

''అన్నపూర్ణా! రాత్రి బాగా పొద్దుపోయింది. అమ్మాయిని పడుకోమను'' అని తన పడక గదిలోంచి కేకలేసారు సావిత్రి తండ్రి.

''నువ్వు రేపు సాయంత్రం బండికే తిరుగు ప్రయాణం. మీ నాన్న అల్లుడికి టెలిగ్రాం ఇచ్చేసారు. పడుకో. ఆయన కసురుకుంటారు'' అని పొడి పొడి మాటలు మాట్లాడి బయటకు వెళ్లిపోయింది అన్నపూర్ణ.

నిద్రపట్టని సావిత్రికి అమ్మానాన్నల గదిలో నుండి చాలా రాత్రివరకూ నెమ్మదిగా మాటలు వినిపించాయి.

★★★

సుగంధ పరిమళాలతో ఆ గది కొత్త మత్తులు సంతరించుకుంది. చక్కటి మధుర సంగీతం టేపు రికార్డులో నుండి వినిపిస్తోంది.

''నీ అధరం మధురం. నీ నేత్రాలు మీనాలు, నీ నాసిక సంపెంగ పూవు. నీ బుగ్గలు సిగ్గుల గులాబీలు, నీ కురులు ఇంద్ర నీలాలవనులు. పయ్యెద తొలగిన నీ ఎద మేరునగసమానాలు. నీ స్పర్శ చల్లని వెన్నెల తాకిడి. ఇవన్నీ నాకే సొంతం.'' మగ గొంతు వినిపిస్తోంది ఆ గదిలో నుండి.

''మీరు మాత్రం తక్కువా? మీ కౌగిలి ఉక్కు కౌగిలికాదూ? మీ మీసాలు తుమ్మెద రెక్కలుకదూ? మీ విశాల వక్షం వదిలి పెట్టడానికి ఏ ఆడదానికయినా సాధ్యమా? మరులుగొలిపే మీ మాటలు వింటూ మీ ఎదమీద సేద తీర్చుకుంటూ మీ కౌగిలిలో రగిలిపోవడంకన్నా నాకేం కావాలి?'' ఆడగొంతు వినిపించింది.

''అబ్బా! అమ్మా!'' అనే మూలుగులు మంచం చప్పుళ్లు చాలాసేపు వినిపించసాగాయి సావిత్రికి.

''నేను వస్తున్నానని టెలిగ్రాం ఇచ్చినా బండికి రాలేదు. నేను రెండురోజులు లేకపోయేసరికి ఈ పనులు పైగా తలుపులు గడియపెట్టకుండా ఉంచేయడం. ఏం చేస్తాం? అయినా ఆయన భ్రమరం. మకరందం గ్రోలడానికి అలవాటుపడ్డారు. లేనిపోని ఆలోచనలు పెట్టుకుని ఆయనకు దూరం కావడం నాదే తప్పు అని అనుకుంటూ తన గదిలోకి వెళ్లి తలుపులు వేసుకుంది.

మర్నాడు తన భార్యలో వచ్చిన చలాకీతనం, కోరికల చూపులు చూసి భాస్కరం చంద్రం దగ్గరకు పరుగెత్తి ఆనందంగా విషయం చెప్పాడు.

''చూసావా మన ప్లాను ఎలా ఫలించిందో! మీ మామగారికి నువ్విచ్చిన టెలిగ్రాంతో ఆయన స్పందించి సహకరించడం మన అదృష్టం. మన ప్లాను ఉభయతారకంగా పనిచేసింది. ఈ రాత్రి మీకు శుభ శోభన రాత్రి అగుగాక'' నవ్వుతూ అన్నాడు చంద్రం.

భాస్కరం ఆ రాత్రి అదే గదిలో అదే సుగంధ పరిమళాలతో మత్తెక్కిపోయి సావిత్రిని బంధించాడు తన కౌగిలిలో. సావిత్రి ఆ కౌగిలిలో పరవశించి కరిగిపోతూ-

''పిల్లాడు పుట్టిన తరువాత మీకు దూరంగా ఉండమని మా అమ్మ చెప్పింది. లేకపోతే మీకు చులకనైపోతానుట. అందుకే మిమ్మల్ని బాధించాను. నన్ను క్షమించండి'' అని భాస్కరాన్ని తమకంగా హత్తుకుంది.

''నీ కురులు నావే, నీ సిరులు నావే'' అంటూ భాస్కరం సావిత్రికి తనకీ మధ్య గాలి దూరడానికి కూడా చోటు లేకుండా చేయాలనుకున్నాడు. మధురానుభవం పొందిన తర్వాత సేదతీరుతూ తృప్తిగా భాస్కరం సావిత్రికి తన ప్లాను వివరించాడు.

''అమ్మదొంగా!'' అని అంటూ భాస్కరాన్ని లతలా పెనవేసుకుపోయింది సావిత్రి, భాస్కరం కళ్లల్లోకి తదేకంగా చూస్తూ.

భాస్కరానికి కరుణశ్రీ పద్యం జ్ఞాపకం వచ్చింది.

'చూచెదవేలనో ప్రణయ సుందరీ,
నీ కాటుక కళ్లలోని ఆలోచనలేమిటో'

★



**క్షణక్షణముల్...**

దాదాపు రెండేళ్లు సాగిన తమ ప్రేమాయణానికి తెర పడిపోయిందని, అనవసరంగా శరత్ కుమార్ ప్రేమలో పడి సినీ కెరీర్‌ని పాడు చేసుకున్నానని ఇటీవల కాలంలో తెగ వాపోయింది నగ్మా. ఇక ప్రేమా దోమా జాన్తానై సినీ కెరీరే ముఖ్యం, శరత్ కుమార్‌కి గుడ్‌బై అంటూ తెగేసి చెప్పిన నగ్మా బాలీవుడ్‌కి మకాం కూడా మార్చింది. కానీ మళ్లీ ఏమైందో ఏమో -ఇప్పుడు తిరిగి శరత్‌తో నగ్మా ప్రేమ మరోసారి చిగురులు తొడుగుతోందని చెప్పుకుంటున్నారు చెన్నై సినీ జనాలు. అంతగా రచ్చకెక్కిన నగ్మాలో అప్పుడే ఇంత మార్పేంటి? అని అంతా ఆశ్చర్యపోతున్న వాళ్లంతా నిప్పులేనిదే పొగరాదు కదా! విషయం ఏమాత్రం లేకుండానే ఈ వార్త ఎలా వ్యాపిస్తుందీ అని కూడా సర్ది చెప్పుకుంటున్నారు. క్షణ క్షణముల్ జవరాండ్ర చిత్తముల్....!

-జె.ఎం.